

ఇకపై డీడీవోలు..

డివిజన్‌కొక అభివృద్ధి అధికారి నియామకం

- ఉమ్మడి జిల్లాలో ఐదుచోట్ల ఒకటో తేదీ నుంచి కార్యాలయాలు ప్రారంభం
- డీడీవో పరిధిలోకి డీఎల్‌పీవో, డ్వామా ఏపీడీ, ఎంపీడీవోలు...
- సచివాలయాల పర్యవేక్షణ బాధ్యత అప్పగింత

విశాఖపట్నం/పాడేరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):



అనకాపల్లిలోని డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయం

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా మరింత మెరుగైన పాలన/సేవలు అందించేందుకు డివిజన్ స్థాయిలో ఒక అధికారిని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటివరకూ కొనసాగుతున్న డివిజన్ స్థాయి అభివృద్ధి అధికారి పోస్టును డివిజనల్ అభివృద్ధి అధికారి (డీడీవో)గా మార్చింది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి డీడీవో కార్యాలయాలు అందుబాటులోకి వస్తాయి. డివిజనల్ పంచాయతీ అధికారి, డ్వామా ఏపీడీ, ఎంపీడీవోలు డీడీఓ పరిధిలోకి వస్తారు. ఇప్పటివరకూ వీరంతా ఎవరికి వారే సొంత కార్యాలయాల నుంచి పాలన నిర్వహిస్తున్నారు. డీడీవోలు జిల్లా కలెక్టర్‌కు జవాబుదారీగా ఉంటారు.

గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ ఏర్పాటు తరువాత సచివాలయాల సిబ్బందిని పర్యవేక్షించేందుకు డీఎల్‌డీవో పోస్టులు కొత్తగా ఏర్పాటుచేశారు. ఎంపీడీవోలలో సీనియర్లను తాత్కాలికంగా డీఎల్‌డీవోలుగా నియమించారు. వీరి కోసం ప్రత్యేకించి భవనాలు నిర్మించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పంచాయతీరాజ్ శాఖను పర్యవేక్షిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేకదృష్టి సారించి ఎంపీడీవోలకు పదోన్నతులు ఇచ్చి డీఎల్‌డీవోలుగా నియమించారు. అయితే పదోన్నతులు ఇవ్వడంతో సరిపెట్టకుండా వారికి మరిన్ని అధికారాలు, బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. డీఎల్‌డీవో పోస్టును డివిజనల్ అభివృద్ధి అధికారి (డీడీవో)గా మార్చారు. పంచాయతీరాజ్‌లో గ్రామ పంచాయతీలను పర్యవేక్షించే డివిజనల్ స్థాయి పంచాయతీ అధికారులు, గ్రామీణాభివృద్ధిలో ప్రధానంగా ఉపాధి హామీ పథకం అమలు తీరును పరిశీలించే డ్వామా ఏపీడీలు డీడీవోల పరిధిలోకి తీసుకువచ్చారు. ఇంకా మండల పరిషత్ అధికారులు (ఎంపీడీవోలు) కూడా డీడీవో పర్యవేక్షణలో పనిచేయాలని ప్రభుత్వం జాబ్ చార్ట్ రూపొందించింది. డివిజన్ పరిధిలో సచివాలయాలు మొత్తం డీడీవో పర్యవేక్షణలో పనిచేస్తాయి. సచివాలయాల సిబ్బంది సర్వీస్ వ్యవహారాలు కూడా డీడీవోనే చూస్తారు. పంచాయతీరాజ్ శాఖలో ఇంజనీరింగ్ పనులపై డీడీవోకు సమీక్షించే అధికారం ఇచ్చారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో విశాఖపట్నం, భీమిలి, అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు కేంద్రంగా డీడీవో కార్యాలయాలు నవంబరు ఒకటో తేదీ నుంచి అందుబాటులోకి వస్తాయని జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. ప్రస్తుతం ఉన్న డీఎల్‌డీవో కార్యాలయాలనే డీడీవో కార్యాలయాలుగా మార్పు చేశామన్నారు. కమిషనర్ ఆదేశాలతో కార్యాలయాల ఆధునికీకరణ, ఫర్నీచర్, పెయింటింగ్ పనుల నిమిత్తం ఒక్కొక్క కార్యాలయానికి రూ.15 లక్షలు వెచ్చించామన్నారు.

రేపటి పీజీఆర్‌ఎస్ కార్యక్రమం రద్దు

- కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌పై వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో ఈ నెల 27న నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీ ఆర్‌ఎస్)ను రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ విజయకృష్ణన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగానే పీజీఆర్‌ఎస్ కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు ఆమె పేర్కొన్నారు. అర్జీలు సమర్పించేందుకు వచ్చే వారు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

జిల్లాలో శనివారం నాగుల చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచే గ్రామాల్లోని పుట్టల వద్దకు కుటుంబ సమేతంగా వెళ్లి పుట్టల్లో పాలు పోసి పూజలు చేశారు. వ్యవసాయ భూముల్లోని పుట్టల వద్ద సందడి కనిపించింది. పిల్లలు, యువకులు బాణసంచా కాల్చి వేడుక చేసుకున్నారు.
- చోడవరం/ఆంధ్రజ్యోతి

చోడవరం మండలంలోని బంగారమ్మపాలెంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



తుఫాన్‌పై అప్రమత్తం

ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా సమర్థంగా ఎదుర్కోవాలి

- వైద్యశాఖ, రెవెన్యూ ఉద్యోగులకు సెలవులు రద్దు
- ఉద్యోగులు అందుబాటులో ఉండాలి
- మత్స్యకారులు వేటకు వెళ్లరాదు.. వెళ్లి ఉంటే వెనక్కి తీసుకురండి
- అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ పొంచివున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. ఈ మేరకు జిల్లాలో అధికారులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం.. మొంథా తుఫాన్‌గా మారి ఈ నెల 26, 27, 28, 29 తేదీల్లో తీవ్ర ప్రభావం చూపనుందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేయడంతో జిల్లాలో అన్ని మండలాల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు.

ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఆస్తి, ప్రాణ, పశు నష్టం జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా ఈ నెల 28న



సాయంత్రం కాకినాడ సమీపంలో మొంథా తఫాన్ తీవ్ర తుఫాన్‌గా మారి తీరం దాటనుందని, ఆ సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఉద్యోగులకు సెలవులు రద్దు

మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వైద్యశాఖ, రెవెన్యూ ... మిగతా 6వ పేజీలో

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : డీఐజీ గోపీనాథ్ జెట్టి

విశాఖపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి సూచించారు. విశాఖపట్నం రేంజ్ పరిధిలోని అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల ఎస్పీలతో శనివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. తీర ప్రాంత గ్రామాల్లో హెచ్చరికలు జారీ చేయాలని, ముంపు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండే విధంగా చూడాలని, కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదే విధంగా చోరీలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, పాత నేరస్థులు, అంతర్ రాష్ట్ర ముఠాలపై నిఘా పెట్టాలన్నారు. సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టులు పెట్టే వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని, గంజాయిని అరికట్టాలని ఆదేశించారు.

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు : ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి రూరల్: తుఫాన్ నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని ఎస్పీ తుహిన్‌సిన్హా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల భద్రత కోసం జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు, తహశీల్దార్లు, విద్యుత్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ భద్రత చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

మహిళల ఉపాధికి భరోసా

జిల్లాలో 19 కేంద్రాల్లో ఉచితంగా కుట్టు శిక్షణ

- అర్హులకు కుట్టు మిషన్లు పంపిణీ
- తొలి విడత శిక్షణ పూర్తి
- రెండో విడత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

మహిళల స్వయం ఉపాధికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ద్వారా ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వడమే కాకుండా 75 శాతం హాజరు ఉన్న ప్రతి మహిళకు ఉచితంగా కుట్టు మిషన్ కూడా అందజేయనుంది. ఇందులో భాగంగా జిల్లాలో 19 కేంద్రాలను ఏర్పాటు చేసి మహిళలకు శిక్షణ ఇస్తున్నారు.



కశింకోటలో కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు (ఫైల్)

2014లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆదరణ పథకం పేరుతో చేతి వృత్తిదారులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి, పరికరాలను సబ్సిడీపై అందజేసింది. తరువాత వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆదరణ పథకాన్ని అటకెక్కించింది. మహిళలకు కుట్టు శిక్షణ అందించకపోగా కేంద్రాలను నిర్వీర్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బీసీ కార్పొరేషన్ ద్వారా ఆదరణ 3.0 పథకం కింద జిల్లాలో 2025 సంవత్సరానికి గాను 19 కుట్టు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల ద్వారా ఇప్పటికే తొలి దశ కింద జూన్ నుంచి సెప్టెంబరు మాసాంతం వరకు వివిధ మండలాలకు చెందిన 2,268 మంది మహిళలకు మూడు నెలల పాటు కుట్టు శిక్షణ అందజేసి, వారు స్వయం ... మిగతా 6వ పేజీలో

ఎంఎస్‌ఎంఈ పార్కుకు భూమి సిద్ధం

- రామన్నపాలెంలో 300 ఎకరాల్లో నిర్మాణానికి సన్నాహాలు



రాచపల్లి రెవెన్యూలో పార్కు కోసం సిద్ధం చేసిన ఏపీఐఐసీ భూమి

మాకవరపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎంఎస్‌ఎంఈ పార్కు నిర్మాణం కోసం ఏపీఐఐసీకి సంబంధించిన 300 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు సిద్ధం చేశారు. ఇటీవల పరిశ్రమల ముఖ్య కార్యదర్శి యువరాజ్ ఈ భూములను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. రాచపల్లి రెవెన్యూ రామన్నపాలెం గ్రామం వద్ద 2008లో సుమారు 300 ఎకరాల భూమిని ఏపీఐఐసీ అధికారులు తీసుకున్నారు. అయితే ఈ భూమి ఇప్పటి వరకు రైతుల సాగులోనే ఉంది. కూటమి ప్రభుత్వం ... మిగతా 6వ పేజీలో

భారీ తాగునీటి ప్రాజెక్టుకు కదలిక

రూ.125 కోట్లతో నిర్మించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం

- టెండర్ల ప్రక్రియ పూర్తి
- నిర్మాణానికి అనువైన ప్రదేశాన్ని పరిశీలించిన ఉన్నతాధికారులు



ఎస్.రాయవరం మండలం ఇందేశమ్మవాక వద్ద ప్రాజెక్టుకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు

ఎలమంచిలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):

ఎలమంచిలి మునిసిపాలిటీ ప్రజల దాహార్తి తీరనుంది. రూ.125 కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టు నిర్మాణానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన పనులను శనివారం పబ్లిక్ హెల్త్ ఉన్నతాధికారుల బృందం పరిశీలించింది.

మునిసిపాలిటీ ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా చేసేందుకు ఏఐఐబీ పథకం కింద రూ.125 కోట్లతో భారీ మంచినీటి ప్రాజెక్టు నిర్మాణానికి ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయిందని అధికారులు తెలిపారు. శనివారం ఎస్.రాయవరం మండలం దార్లపూడి సమీపంలో ఇందేశమ్మవాక వద్ద వరహానది పరివాహక ప్రాంతాన్ని ఉన్నతాధికారులు పరిశీలించారు. పబ్లిక్ హెల్త్‌కు చెందిన ఇంజనీరింగ్ చీఫ్ ఎం.ప్రభాకరరావు, ఎస్ఈ కామేశ్వరరావు, ఈఈ దక్షిణామూర్తి, డీఈ మహేశ్ వరహా నది ప్రాంతాన్ని సందర్శించారు. ఈ ప్రాంతంలో ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన పంపు హౌస్‌లు, ఇన్‌ఫిల్టరేషన్ బావుల నిర్మాణానికి అనుకూలమైన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే మునిసిపాలిటీ ప్రజలకు తాగునీటి కష్టాలు తీరినట్టే. ఉన్నతాధికారుల వెంట ఏఈలు అప్పారావు, నానాజీ ఉన్నారు.

ఫైబర్ తెప్ప బోల్తా పడి మత్స్యకారుడి మృతి

- తిక్కవానిపాలెం తీరంలో ఘటన



చేపల మసేను (ఫైల్ ఫొటో)

పరవాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో చేపల వేటకు వెళ్లిన ఒక మత్స్యకారుడు ప్రమాదవశాత్తూ ఫైబర్ తెప్ప బోల్తా పడడంతో మృతి చెందాడు. మండలంలోని తిక్కవానిపాలెం వద్ద సముద్రతీరంలో శనివారం తెల్లవారుజామున ఈ సంఘటన చోటుచేసుకుంది. దీనికి సంబంధించి మృతుని కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తిక్కవానిపాలెం గ్రామానికి చెందిన చేపల మసేను(45)తో పాటు దూడ పరదేశి, సూరాడ చంద్రరావు, మేరుగు రాజయ్య, సూరాడ నాగమయ్య, సూరాడ దేశిరాజు, చేపల ప్రసాద్ శనివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు ఫైబర్ తెప్ప పై తిక్కవానిపాలెం సముద్రతీరంలో చేపల వేటకు బయలుదేరారు. వీరు వెళ్లిన కొద్దిసేపటికే ఒక్కసారిగా భారీ కెరటం రావడంతో ఫైబర్ తెప్ప బోల్తా పడింది. ఈ క్రమంలో అలల ధాటికి చేపల మసేను గల్లంతయ్యాడు. మిగతా మత్స్యకారులు అతని కోసం గాలించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో వారు ఒడ్డుకు చేరుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో చేపల మసేను మృతదేహం తిక్కవానిపాలెం - ముత్యాలమ్మపాలెం తీరం మధ్య ఒడ్డుకు కొట్టుకువచ్చింది. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మసేను మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. ఈ మేరకు సీఐ ఆర్.మల్లికార్జునరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సోలాపూర్ ప్రత్యేక రైలు వెలవెల

ప్రచారం లేక ప్రయాణికుల నుంచి స్పందన కరువు





అనకాపల్లి నుంచి బయలుదేరిన సోలాపూర్ ప్రత్యేక రైలు, (ఇన్‌సెట్‌లో) స్లీపర్ బోగీలో ఖాళీగా ఉన్న సీట్లు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రైల్వేశాఖ అనకాపల్లి నుంచి సోలాపూర్‌కు 01478 నంబరుతో నడిపే ప్రత్యేక రైలుకు ప్రయాణికుల నుంచి స్పందన అంతంత మాత్రంగానే ఉంది. శనివారం ఈ రైలు అనకాపల్లి రైల్వేస్టేషన్ నుంచి సాయంత్రం 5.35 గంటలకు బయలుదేరింది. ఎలమంచిలి, సామర్లకోట, రాజమహేంద్రవరం, ఏలూరు, విజయవాడ జంక్షన్, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు జంక్షన్, శ్రీకాళహస్తి, రేణిగుంట, తిరుపతి, పాకాల, పీలేరు, మదనపల్లి, కదిరి, ధర్మవరం, అనంతపూర్, గుంతకల్లు, అధోని, మంత్రాలయం, రాయచూర్, కృష్ణా, యాదగిరి, వాడి జంక్షన్, కలాబురాగి, గంగపూర్ రోడ్డు, దుదాని, అఖల్‌కోట్ మీదుగా సోలాపూర్ జంక్షన్‌కు ఆదివారం రాత్రి 11.50 గంటలకు చేరుకుంటుందని రైల్వే అధికారులు తెలిపారు. అయితే ఈ రైలుకు ప్రచారం అంతంత మాత్రంగానే ఉండడంతో ప్రయాణికుల నుంచి స్పందన కరువైంది. పట్టణ పరిసర ప్రాంతాల వారి కంటే విశాఖపట్నం, పెందుర్తి, సబ్బవరం, గాజువాక ప్రాంతాల నుంచి ఎక్కువ మంది ప్రయాణికులు కుటుంబ సమేతంగా ప్రత్యేక వాహనాల్లో అనకాపల్లి రైల్వేస్టేషన్‌కు వచ్చి రైలు ఎక్కి ప్రయాణం సాగించారు. ఈ రైలులో రెండు ఏసీ బోగీలు, 12 స్లీపర్ క్లాసు బోగీలు, ఆరు జనరల్ బోగీలు ఉన్నప్పటికీ అనకాపల్లి నుంచి ... మిగతా 6వ పేజీలో

5 ప్రైవేటు ట్రావెల్ బస్సులు సీజ్

- కొనసాగుతున్న ఆర్టీవో తనిఖీలు



నక్కపల్లి టోల్ ప్లాజా వద్ద తనిఖీలు చేస్తున్న రవాణాశాఖాధికారులు

అనకాపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో ప్రైవేటు ట్రావెల్ బస్సు ప్రమాదానికి గురైన నేపథ్యంలో రవాణాశాఖ అధికారులు తనిఖీలు కొనసాగిస్తున్నారు. శనివారం 5 బస్సులను సీజ్ చేశారు. అనకాపల్లి జాతీయ రహదారి కూడలి, నక్కపల్లి, మర్రిపాలెం టోల్ ప్లాజాల వద్ద జిల్లా రవాణాశాఖాధికారి జి.మనోహర్ నేతృత్వంలో శనివారం ఉదయం నుంచి ఆ శాఖ అధికారులు బృందాలుగా విడిపోయి ప్రైవేటు బస్సులను తనిఖీ చేశారు. లైసెన్స్‌లు, సరైన ఫిట్‌నెస్ లేని వాహనాలపై కేసులు నమోదు చేశారు. పెండింగ్ చలాన్లను చెల్లిస్తేనే వాహనాలు వెళ్లేందుకు అనుమతించారు. ఈ తనిఖీల్లో 12 కేసులు నమోదు చేసి, ఎమర్జెన్సీ ఎక్సిట్ ద్వారాలు సరిగ్గా లేని కారణంగా ఐదు ప్రైవేటు బస్సులను సీజ్ చేసినట్టు ఆర్టీవో మనోహర్ తెలిపారు. ఈ తనిఖీలను కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు.




భూలోకమాంబను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, రమాకుమారి, అమర్‌నాథ్, ధర్మశ్రీ



తీర్థానికి హాజరైన భక్తజనం

ఎలమంచిలిలో ఎటు చూసినా భక్తజనమే..

▸ వైభవోపేతంగా పంచరాత్రుల ఉత్సవాలు ▸ వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలి రాక ▸ భూలోకమాంబ, సుబ్రహ్మణ్యేశ్వర ఆలయాల్లో పూజలు

ఎలమంచిలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రలో ప్రసిద్ధిగాంచిన వేడుకల్లో ఒకటైన ఎలమంచిలిలోని పంచరాత్రుల మహోత్సవం శనివారం అత్యంత వైభవోపేతంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలి రావడంతో పట్టణ వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. ఇక్కడి తులసీనగర్‌లోని భూలోకమాంబ ఆలయంతో పాటు, పాతవీధిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో వేకువజామున విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అప్పటికే ఈ రెండు ఆలయాల వద్ద జనం బారులుతీరి నిలిచారు. విద్యుద్దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తీర్థం సందర్భంగా ప్రధాన రోడ్డు వెంబడి వ్యాపారులు తాత్కాలిక వ్యాపార సముదాయాలు, స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి అడపాదడపా చిరు జల్లులు కురుస్తుండడంతో అంతా ఆందోళన చెందారు. సాయంత్రం ఐదు గంటల నుంచి వాతావరణం పొడిగా మారడంతో తీర్థానికి భక్తుల రాక ఆరంభమైంది. రాత్రి ఎనిమిది గంటలకు ఇసుక వేస్తే రాలనంతగా తరలి వచ్చారు. పలుచోట్ల వేదికలపై ఏర్పాటైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. దేవతామూర్తులను ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారితో పాటు కూటమి నాయకులు దర్శించుకున్నారు. మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, బొడ్డేడ ప్రసాద్, బొద్దపు యర్రయ్యదొర, పలువురు వైసీపీ నేతలు అమ్మవారికి పూజల జరిపారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ విష్ణుస్వరూప్ పర్యవేక్షణలో నలుగురు సీఐలు, 12మంది ఎస్ఐలు, 200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పట్టణంలోకి బస్సులు, ఇతర వాహనాలు రాకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మళ్లించారు.



జనసంద్రంగా మారిన ఎలమంచిలి ప్రధాన రోడ్డు

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

ఎలమంచిలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సీపీపేట ప్రాంతంలో శనివారం ఇంటి మేడపై బట్టలు ఆరబెడుతుండగా 11 కేవీ విద్యుత్ వైర్లు ప్రమాదవశాత్తూ తగలడంతో పెరిశెట్టి దీపిక (24) అనే మహిళ మృతిచెందింది. విద్యుత్ షాక్‌కు గురైన వెంటనే కుటుంబ సభ్యులు సీహెచ్‌సీకి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్ఐ సావిత్రి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

ఎలమంచిలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ పరిధి యర్రవరం సమీపం జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున ట్రాలీని వెనుక నుంచి లారీ ఢీకొనడంతో విజయనగరం జిల్లా జామి మండలం చిల్లపాలేనికి చెందిన కొయ్య రాజేశ్ (29) అనే డ్రైవర్ మృతిచెందాడు. తుని నుంచి విశాఖ వైపు వస్తున్న ట్రాలీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఈ ఘటన జరిగింది.

మల్లవరంలో ఘనంగా గౌరీదేవి పండుగ

▸ మేళతాళాల నడుమ జాజవుల నిమజ్జనం ▸ ఎమ్మెల్యే విజయ్‌కుమార్ హాజరు



జాజవులను ఊరేగింపుగా నదిలో నిమజ్జనానికి తీసుకు వెళుతున్న మహిళలు

అచ్యుతాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లవరంలో గౌరీదేవి పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు. ఏటా దీపావళి రోజున ఈ వేడుక ఆరంభమై నాగుల చవితి రోజున ముగుస్తుంది. దీపావళి రోజున గ్రామంలో మహిళలంతా ఉపవాసం ఉండి బొబ్బర్లు, పెసలు, చోళ్ల, మినుగులు వంటి పప్పు దినుసులను ఒకదగ్గర మట్టిలో వేసి నీరు పోస్తారు. అప్పటి నుంచి గ్రామంలో మహిళలంతా చాలా నిష్టగా ఉంటారు. ప్రతి రోజూ రాత్రికి గౌరీదేవికి పాటలు పాడుతారు. రోజురోజుకి పప్పు దినుసులు మొక్కలు మొలుస్తాయి. వీటినే వీరు జాజవులు అంటారు. నాగుల చవితినాడు శనివారం గ్రామస్థులంతా కలిసి ఈ జాజవులను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకుని వెళ్లి గ్రామానికి సమీపంలో పారుతున్న గోరికివాని గెడ్డ వద్దకు చేరుకుని వరి దుబ్బుకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జాజవలను గెడ్డలో కలిపారు. ఈ వేడుకకు ఎమ్మెల్యే విజయకుమార్ హాజరయ్యారు. సర్పంచ్ పిన్నమరాజు వాసు, శ్రీనివాసరావు, చిన్ని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చవితి వేడుకలు

▸ కుటుంబాలతో సహా పుట్టల వద్దకు వెళ్లి నాగేంద్రస్వామికి పూజలు ▸ పల్లెల్లో మరింత కోలాహలం





అచ్యుతాపురం, రాంబిల్లి మండలం పంచదార్ల, మునగపాకలలో పుట్టల వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఎలమంచిలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నాగుల చవితి వేడుకలను ఎలమంచిలి, అచ్యుతాపురం, రాంబిల్లి, మునగపాక మండలాల్లో ప్రజలంతా శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువనే నిద్ర లేచి పూజకు అవసరమైన చిమిలి, చలిమిడి, పాలు, గుడ్లు తదితరాలను సిద్ధం చేసుకున్న అనంతరం కుటుంబాలతో పుట్టలకు వెళ్లారు. నాగేంద్ర స్వామికి వీటిని నైవేద్యంగా సమర్పించి పుట్టలో పాలు, గుడ్లు వేసి మనసారా ఆరాధించారు. దీంతో ఎక్కడ చూసిన కోలాహల వాతావరణం నెలకొంది. ఎలమంచిలిలోని నాగేంద్రస్వామి ఆలయం వేకువజాము నుంచి భక్తులతో కిటకిటలాడింది. అలాగే అన్ని వార్డులతో పాటు మండలంలోని గ్రామ గ్రామాన ఈ వేడుకను ఘనంగా జరుపుకున్నారు. పల్లెల్లో కుటుంబాలతో సహా పుట్టలకు వెళ్లడం కనువిందు చేసింది.

అచ్యుతాపురం మండలంలో...

అచ్యుతాపురం : మండలంలో నాగుల చవితి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఉదయం అంతా కుటుంబాలతో సహా పుట్టల వద్దకు వెళ్లి గుడ్లు, పాలు తదితరాలు నైవేద్యంగా సమర్పించి పూజలు జరిపారు. దీంతో అంతటా సందడి వాతావరణం నెలకొంది. పల్లెల్లో ఒకే ఇంటిపేరు గల పలువురు కుటుంబాతో సహా పుట్టలకు వెళ్లి నాగేంద్రస్వామికి మొక్కులు తీర్చుకున్నారు.

మునగపాక మండలంలో...

మునగపాక : నాగుల చవితిని ప్రజలంతా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వ్యవసాయ ఆధారిత మండలం కావడంతో రైతులు కుటుంబాలతో సహా పుట్టల వద్దకు వెళ్లారు. ఉదయం నుంచి రాత్రి వరకు పొలం పనులు చేసుకుటంటై గట్లపై నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. దినచర్యల్లో అనేకసార్లు పాములు తారసపడుతూనే ఉంటాయి. అది దృష్టిలో పెట్టుకొని నాగేంద్రస్వామికి రైతులంతా మొక్కులు చెల్లించుకున్నారు. తమకు ఎటువంటి హాని చేయకుండా చల్లంగ కాపాడాలని వేడుకున్నారు. ఇదిలావుంటే, మండలంలోని తిమ్మరాజుపేటలో నాగుల చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన రేలారే రేల జానపద గీతాలు అలరించాయి. మాజీ సర్పంచ్ సూరిశెట్టి రాజేశ్వరి, ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ సూరిశెట్టి రాము ఆధ్వర్యంలో జానపద కళాకారులతో పాటు గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు తదితరులను ఘనంగా సత్కరించారు.



ఎలమంచిలి నాగేంద్రస్వామి ఆలయంలో భక్తులు పుట్టపూజ

రాంబిల్లి మండలంలో...

రాంబిల్లి : నాగుల చవితి వేడకలను మండల ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువనే లేచి స్నానాలు ఆచరించి కొత్తబట్టలు ధరించి కుటుంబ సభ్యులతో కలిసి గ్రామ సమీపంలోని పొలాల్లో గల పుట్టల వద్దకు వెళ్లారు. అక్కడ పాలు పోసి, గుడ్లు వేసి నాగేంద్రస్వామిని పూజించారు. లాలంకోడూరులో సప్తపడగలతో కొలువుదీరిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు.

నదిలో స్నానానికి దిగి ఒకరి మృతి

ఎలమంచిలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధి సోమలింగపాలెం సమీపంలో శారదా నదిలో శనివారం స్నానానికని దిగి ప్రమాదవశాత్తూ ఒక వ్యక్తి మృతి చెందినట్టు రూరల్ ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు. దీనికి సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. గాజువాకలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన తోటిపూడి రామచంద్రరావు(34) అక్కడ వస్త్ర దుకాణంలో పని చేస్తున్నాడు. నాగుల చవితి సందర్భంగా భార్య, పిల్లలతో శుక్రవారం సోమలింగపాలెంలోని అత్తవారింటికి వచ్చాడు. శనివారం ఉదయం స్థానికులతో కలిసి స్నానానికి శారదా నదికి వెళ్లాడు. ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తూ మునిగి మృతి చెందాడు. మృతదేహాన్ని స్థానికులు బయటకు తీసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎలమంచిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

తుఫాన్‌పై అప్రమత్తం

... 5వ పేజీ తరువాయి

ఉద్యోగులకు సెలవులు రద్దు చేశారు. జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు, ఉద్యోగులు పనిచేసే ప్రదేశాల్లో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. రానున్న నాలుగు రోజుల్లో ఉద్యోగులకు అత్యవసరం అయితే తప్ప సెలవులు ఇవ్వరాదని అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని, ఎవరైనా సముద్రంలోకి ఇప్పటికే వెళ్లి ఉంటే ఒడ్డుకు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులకు సూచించారు. తీర ప్రాంతాలైన పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, ఎలమంచిలి, అచ్యుతాపురం, పరవాడ మండలాల్లో అధికారులతో కలెక్టర్ మాట్లాడి పలు సూచనలు చేశారు. అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ జాహ్నవి, డీఆర్‌వో సత్యనారాయణరావు, పీఆర్, రోడ్లు, భవనాలు, పోలీసు, అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తక్షణ సహాయక చర్యలు అందించే ఉద్దేశంతో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. డివిజన్, మండల కేంద్రాల్లోనూ రానున్న మూడు రోజుల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి, మండలాల్లో వరద తీవ్రతపై ఎప్పటికప్పుడు సమాచారం అందించేలా ఏర్పాట్లు చేశారు.

కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబర్లు: 08924 222888, 08924225999, 08924226599

ముక్కంటిని తాకిన సూర్య కిరణాలు



ఉపమాకలో శివలింగాన్ని స్పృశిస్తున్న కిరణాలు

నక్కపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక ప్రాచీన శివాలయంలో శనివారం సూర్యోదయ వేళ ప్రత్యక్ష దైవం ఆదిత్యుని కిరణాలు నేరుగా గర్భగుడిలోని శివలింగాన్ని స్పృశించాయి. త్రినేత్రుడికి అర్చకస్వాములు పంచామృతాభిషేకం చేసి,పూజలు చేస్తున్న సమయంలో భానుడి లేలేత కిరణాలు శివలింగాన్ని తాకడంతో పసిడికాంతులతో పరిసరాలు నిండాయి. ఈ సందర్భంగా అయ్యప్ప దీక్షాపరులు, శివ స్వాముల శివ పంచాక్షరీ నామంతో ఆలయం మార్మోగింది.

బల్క్‌డ్రగ్స్ పార్కు రద్దు చేయాలి: సీపీఎం



మాట్లాడుతున్న సీపీఎం నేత అప్పలరాజు

ఎస్. రాయవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి మండలం, రాజయ్యపేట మత్స్యకారుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని అక్కడి బల్క్ డ్రగ్స్ పార్కును రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. అప్పలరాజు డిమాండ్ చేశారు. మండలంలోని ధర్మవరం అగ్రహారంలో అప్పలరాజు శనివారం రాజయ్యపేట మత్స్యకార నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శుక్రవారం రాజయ్యపేటలో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అక్కడి మత్స్యకారులు చెప్పిన అన్ని అంశాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఆ మండలంలో హెట్రో డ్రగ్స్ పరిశ్రమతో నష్టాలతో పాటు ఇప్పుడు ఏర్పాటు చేస్తున్న బల్క్ డ్రగ్స్ పార్కు వల్ల భవిష్యత్తులో తలెత్తే సమస్యలపై ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరారు. హోం మంత్రి వంగలపూడి అనిత సీఎం చంద్రబాబు దృష్టికి మత్స్యకారుల అభిప్రాయాలను తీసుకుని వెళ్లి బల్క్ డ్రగ్స్ పార్కు రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు ఎం మహేశ్, బాబు, సోమేశ్వరరావు, మాధవరావు, నానాజీ తదితరులు పాల్గొన్నారు.



పాయకరావుపేట శివారులో పుట్ట వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వైభవంగా నాగులచవితి

పాయకరావుపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగుల చవితి పండుగను శనివారం పాయకరావుపేట ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నూతన దుస్తులు ధరించి కుటుంబ సభ్యులతోసహా ఉదయం వ్యవసాయ భూముల్లోని పుట్టల వద్దకు చేరుకుని చవితి జరిపారు. పిల్లలు, యువకులు బాణసంచా కాల్చి వేడుక చేసుకున్నారు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య ఘనంగా జరుపుకున్నారు.

కోటవురట్ల: మండలంలోని అన్నవరం, కోటవురట్ల, లింగాపురం, కైలాసపట్నం, తంగేడు, జల్లూరు, సుంకపూర్‌ల్లో నాగులచవితి ఘనంగా నిర్వహించారు. మహిళలు ఉపవాసాలతో నాగేంద్రుడికి మొక్కులు తీర్చుకున్నారు. పొలాల్లో పుట్టల నా గేంద్రుడికి మొక్కులు తీర్చుకున్నారు. రైతులు పంటలు దిగుబడులు రావాలని ప్రార్థించారు.



రేబాకలో నాగుల చవితివేడుకలు జరుపుకుంటున్న భక్తులు



నక్కపల్లి మండలం సీతంపాలెంలో నాగుల చవితి సందడి

నక్కపల్లి: మండలంలో గ్రామాల్లో ఇళ్లల్లో పూజలు, దీపారాధన చేసిన అనంతరం పంట పొలాల వద్ద వున్న పుట్టల వద్దకు వెళ్లి నాగేంద్రుడికి పూజలు చేశారు. నక్కపల్లి సహా ముకుందరాజుపేట, దోసలపాడు, రేబాక, గుల్లిపాడు, ఉపమాక, జానకయ్యపేట,వేంపాడు, ఉద్దండపురం, జీ జగన్నాధపురం, సీతంపాలెం, కాగిత, చినదొడ్డిగల్లు, అమలాపురం గ్రామాల్లో ఎంతో సందడిగా చవితి వేడుకలు జరిగాయి.

ఎస్. రాయవరం: నాగుల చవితి పురస్కరించుకుని శనివారం ఉదయం నుంచి పొలాల్లో ఉన్న పుట్టల వద్దకు వెళ్లి పాలు, గుడ్లు తదితర ప్రసాదాలు వేసి పలువురు పూజలు చేశారు. కుటుంబ సమేతంగా పొలాల్లోని పుట్టల వద్దకు వెళ్లడడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.



లింగాపురంలో పుట్టలో పాలుపోస్తున్న భక్తులు

కొనసాగుతున్న మత్స్యకారుల దీక్షలు



రాజయ్యపేటలో నిరసన దీక్షల్లో మత్స్యకారులు

నక్కపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా రాజయ్యపేటలో మత్స్యకారుల నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం కలెక్టర్, మత్స్యకారులకు మధ్య జరిగిన చర్చలు సఫలం కాకపోవడంతో, మత్స్యకారులంతా యథావిధిగా తమ నిరసనను కొనసాగించాలని నిర్ణయించుకున్నారు. శనివారం నాగుల చవితి రోజూ గంగపుత్రులు శిబిరానికి చేరుకుని 42వ రోజు ఆందోళన కొనసాగించారు. బల్క్‌డ్రగ్ పార్కును రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ

నక్కపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది శివారు గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులపై శ్రద్ధ వహించాలని స్థానిక ఎంపీడీవో డీ సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో కె.చలపతిరావు సూచించారు. శనివారం మండలం దేవవరం శివారు చినరాంభద్రపురంలో వారు పర్యటించారు. ప్రజల నుంచి పలు సమస్యలు తెలుసుకున్నారు. తాగునీటి సమస్య లు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.అనంతరం దేవవరం పంచాయతీ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపారు.



శివారు గ్రామాల్లో సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీడీవో సీతారామరాజు

తుఫాన్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

▸ తహశీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

▸ తహశీల్దార్ మహేశ్వరరావు

పాయకరావుపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో నెలకొన్న తుఫాన్ నేపథ్యంలో మండలంలో ఆదివారం నుంచి నాలుగు రోజులపాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఎస్ఏ మహేశ్వరరావు తెలిపారు. శనివారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివారం నుంచి ఈనెల 29వ తేదీ వరకు భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలను అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా సిబ్బంది ఉండాలన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో పనిచేసే ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని కంట్రోల్ రూమ్‌కి సమాచారం ఇవ్వాలని ఆయన ఆదేశించారు. తుఫాన్ ఈ ప్రాంతంలోనే తీరం దాటే అవకాశం ఉన్నందున మండలంలోని మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని ఆదేశించారు. కార్తీకమాసం పురస్కరించుకుని ప్రజలు సముద్ర తీరంలో పిక్నిక్‌లు, సముద్ర స్నానాలు చేయవద్దని హెచ్చరించారు. తీర ప్రాంతంలో పోలీసులు, మెరైన్ పోలీసులు, వీఆర్వోలు, వీఏఓలతో గస్తీ ఏర్పాటు చేసినట్టు ఆయన వివరించారు.



తహసీల్దార్ మహేశ్వరరావు

మహిళల ఉపాధికి భరోసా

... 5వ పేజీ తరువాయి

ఉపాధి పొందే విధంగా తీర్చిదిద్దారు. మూడు నెలల శిక్షణలో 75 శాతం హాజరు కలిగిన ప్రతి మహిళకు శిక్షణ పొందినట్టు ధ్రువీకరణ పత్రంతో పాటు బీసీ కార్పొరేషన్ ద్వారా ఉచితంగా రూ.6,199 విలువ చేసే కుట్టు మిషన్‌ను అందజేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అనకాపల్లి, అచ్యుతాపురం, కశింకోట, చోడవరం, నర్సీపట్నం, మాడుగుల, పాయకరావుపేట కేంద్రాల్లో కుట్టు శిక్షణ పొందేందుకు బీసీ మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి శిక్షణ పొందారు.

శిక్షణ కోసం రిజిస్ట్రేషన్లు

కుట్టు శిక్షణ పొందేందుకు ఆసక్తి గల మహిళలు మండల అభివృద్ధి కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకొనే అవకాశాన్ని కల్పించారు. దరఖాస్తులు అందిన తరువాత ఆయా మహిళల వివరాలను మ్యాపింగ్ చేయడం ద్వారా కుట్టు శిక్షణ శిబిరానికి ఆహ్వానిస్తారు. జిల్లాలో రెండో విడత కింద మరో మూడు వేల మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాటు చేస్తున్నారు. త్వరలోనే రెండో ధశ కుట్టు శిక్షణ శిబిరాలను ప్రారంభించనున్నారు. ఈ అవకాశాన్ని అర్హత కలిగిన ప్రతి బీసీ మహిళ సద్వినియోగం చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఈడీ జ్యోతిశ్రీ కోరారు.

ఎంఎస్‌ఎంఈ పార్కుకు భూమి సిద్ధం

... 5వ పేజీ తరువాయి

వచ్చిన తరువాత ఇక్కడ ఎంఎస్‌ఎంఈ పార్కు నిర్మించాలని నిర్ణయించడంతో ఈ భూమిని రైతుల నుంచి రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో భాగంగా గత నెల రోజులుగా ఈ భూమిలో ఉన్న వ్యవసాయ పంటలతో పాటు చెట్లను తొలగించారు. నవంబరు నెలలో ఇక్కడ ఎంఎస్‌ఎంఈ పార్కు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని ప్రచారం జరుగుతోంది. పార్కు నిర్మాణం కోసం భూమి పనులు పూర్తి చేసినట్టు రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.

సోలాపూర్ ప్రత్యేక రైలు వెలవెల

... 5వ పేజీ తరువాయి

ప్రారంభమైన రైలులో ప్రయాణికుల సంఖ్య అంతంత మాత్రంగానే కనిపించింది. ఈ రైలు ప్రతీ శనివారం అనకాపల్లి నుంచి సోలాపూర్‌కు నవంబరు 29వ తేదీ వరకు నడుస్తుందని రైల్వే అధికారులు చెబుతున్నారు. సోమవారం తిరుపతికి ప్రత్యేక రైలు ఉంది. సోలాపూర్ రైలు కూడా తిరుపతి మీదుగా వెళ్లడంతో తిరుమల శ్రీనివాసుని దర్శనానికి వెళ్లే భక్తులకు ఉపయోగకరంగా ఉంటుందని రైల్వే అధికారులు చెబుతున్నారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ రైల్వే స్టాండింగ్ బోర్డు చైర్మన్‌గా ఉండడంతో అనకాపల్లి నుంచి ఎన్నడూ లేని విధంగా ప్రత్యేక రైళ్లు ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చాయి. సోమవారం తిరుపతికి, మంగళవారం సికింద్రాబాద్‌కి, బుధవారం నాందేడ్, శుక్రవారం కాచిగూడ, శనివారం సోలాపూర్‌లకు ప్రత్యేక రైళ్లు ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చాయి. సోమవారం అనకాపల్లి నుంచి వెళ్లే తిరుపతి స్పెషల్‌కు స్లీపర్ బోగీలు కూడా ఏర్పాటు చేయడంతో ప్రయాణికులకు రిజర్వేషన్ దొరికే అవకాశాలున్నాయని రైల్వే అధికారులు చెబుతున్నారు.

13న బెంగళూరుకు ప్రత్యేక రైలు

అనకాపల్లి నుంచి బెంగళూరుకు నవంబరు 13వ తేదీన ప్రత్యేక రైలు అందుబాటులోకి రానున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో ప్రశాంతి నిలయం సమీపంలోని ఎలహంకకు ఈ రైలు సత్యసాయి భక్తుల కోసం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.


ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో నాగదుర్గమ్మను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద


సబ్బవరం మండలం మొగలిపురంలో పుట్టలో పాలు పోసేందుకు విచ్చేసిన గండి బాబ్జీ, కుటుంబ సభ్యులు


కొత్తూరులోని బీఆర్‌టీ కాలనీలో పుట్టలో పాలుపోసి పూజ చేస్తున్న భక్తులు

నాగరాజా.. అందుకో మా పూజ..

▸▸ అత్యంత భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు ▸▸ కుటుంబాల సహా పుట్టల వద్దకు వెళ్లి పాలుపోసి మొక్కులు ▸▸ పల్లెల్లో మిన్నంటిన సంబరాలు


నాగేంద్రునికి పాలపోస్తున్న జడ్పీ


పరవాడ మండలం వెన్నెలపాలెంలో పుట్టలో పాలు పోసేందుకు వెళుతున్న భక్తులు


డైట్ కళాశాల ప్రాంగణంలో మాజీ మంత్రి దాడి కుటుంబం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నాగుల చవితి పర్వదినాన్ని అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లో ప్రజలంతా శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువనే నిద్ర లేచి పూజకు అవసరమైన చిమిలి, చలిమిడి, పాలు, గుడ్లు, తాటిగుజ్జు తదితరాలను సిద్ధం చేసుకున్న అనంతరం కుటుంబ సభ్యులంతా కలిసి పుట్టలకు వెళ్లారు. అనంతరం నాగేంద్ర స్వామికి వీటిని నైవేద్యంగా సమర్పించి పుట్టలో పాలు, గుడ్లు వేసి మనసారా ఆరాధించారు. దీంతో ఎక్కడ చూసిన కోలాహల వాతావరణం నెలకొంది. అనకాపల్లి పట్టణంలో ఈ సంబరాలు మిన్నంటాయి. దిబ్బవీధిలో పురాతన నాగేంద్రుని ఆలయంతో పాటు రెండున్నర దశాబ్దాల చరిత్ర కలిగిన ఎన్టీఆర్ మార్కెట్ యార్డులోని నాగదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. శారదా నది ఒడ్డున, ఎన్టీఆర్ మార్కెట్ యార్డు, జాతీయ రహదారి, పూల్‌బాగ్ ప్రాంతాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పుట్టల్లో పాలుపోసి స్వామి మొక్కులు తీర్చుకున్నారు. జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె. చక్రవర్తి దంపతులు దిబ్బవీధి నాగేంద్రుని ఆలయంలో పాలు పోశారు. అక్కడే ఉన్న సింహాద్రి అప్పన్నను, సీతారాముల ఆలయాలను దర్శించుకున్నారు. దిబ్బవీధి నాగేంద్రస్వామి ఆలయంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు పూజలు చేశారు. గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర కుటుంబ సభ్యులతో చవితి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మార్కెట్ యార్డు, దిబ్బవీధి నాగేంద్రుని ఆలయాల్లో పూజలు చేశారు. అలాగే, డైట్ కళాశాలలో పుట్ట వద్ద మాజీ మంత్రి దాడి వీరభద్రరావు కుటుంబ సభ్యులతో వెళ్లి పాలు పోసి నాగేంద్రునికి పూజలు చేశారు. అదేవిధంగా ఎన్టీఆర్ మార్కెట్ యార్డులోని అమ్మవారిని టీడీపీ నాయకులు దర్శించుకున్నారు. అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావులు వేర్వేరు సమయాల్లో ఆలయానికి వెళ్లి పూజలు జరిపారు.

కొత్తూరు :వెంకుపాలెం, తగరంపూడి, బీఆర్‌టీ కాలనీ, రామాపురం, సుందరయ్యపేట, సంపతిపురం, కూండ్రం, కుంచంగి, జంగాలపాలెం తదితర గ్రామాల్లో నాగుల చవితి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. భక్తులు ఆయా గ్రామాల్లో ఉన్న పుట్టల వద్దకు వెళ్లి గుడ్లు, పాలు వంటివాటిని నాగేంద్రునికి సమర్పించారు.

పరవాడ మండలంలో...

పరవాడ : నాగుల చవితి పర్వదినాన్ని మండల వ్యాప్తంగా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కుటుంబసమేతంగా పొలాల బాటపట్టారు. నాగేంద్రస్వామికి ఇష్టమైన చిమిలి, తాటిగుజ్జు, పాలు, గుడ్లు వంటి వాటిని నైవేద్యంగా సమర్పించారు. పిల్లలు, పెద్దలు అనే తారతమ్యం లేకుండా అందరూ తండోపతండాలుగా పొలాలకు వెళ్లి పుట్టల వద్ద పూజలు చేశారు. పరవాడలో ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి శ్రీనివాస్ దంపతులు పుట్టలో పాలు పోశారు.

లంకెలపాలెం : జీవీఎంసీ 79, 85 వార్డుల పరిధి లంకెలపాలెం, మంత్రిపాలెం, ఇ-మర్రిపాలెం, పెదముషిడివాడ, కన్నూరు, మడకపాలెం, గండివానిపాలెం, పచ్చిగోరువానిపాలెం, నక్క వానిపాలెం, విజయరాంపురం, సాలాపువానిపాలెం, పరిసర ప్రాంత గ్రామాల్లో శనివారం నాగుల చవితి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. కుటుంబాలతో సహా పుట్టల వద్దకు వెళ్లి పాలుపోసి, నాగేంద్రస్వామిని ఆరాధించారు.

సబ్బవరం మండలంలో...

సబ్బవరం : నాగుల చవితిని మండల ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం కుటుంబాల సమేతగా పుట్టల వద్దకు వెళ్లి నాగేంద్రస్వామికి గుడ్లు, పాలు తదితరాలను నైవేద్యంగా సమర్పించారు. మొగలిపురంలో ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ గండి బాబ్జీ, రావలమ్మపాలెంలో బీజేపీ నాయకులు చొక్కాకుల వెంకటరావు, సబ్బవరంలో శాప్ డైరెక్టర్ పీబీవీఎస్ఎన్ బుచ్చిరాజు, మలునాయుడుపాలెంలో పీఏసీఎస్ ఛైర్మన్ గండి దేముడు, గుల్లేపల్లిలో ఎంపీపీ బోకం సూర్యకుమారి పుట్టలో పాలుపోశారు.

తుఫాన్ హెచ్చరికతో పలు శాఖలు అప్రమత్తం

▸▸ కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు చేసిన అధికారులు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రకటన నేపథ్యంలో జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి శనివారం తెలిపారు. రెండు రోజుల పాటు ఈ తుఫాన్ ప్రభావం అధికంగా ఉంటుందని, భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ స్పష్టం చేయడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాల కారణంగా ఎక్కడైనా ఎటువంటి సంఘటనలు జరిగినా 08924- 222747 నంబర్‌కు కాల్ చేయాల్సిందిగా సూచించారు. అలాగే జోనల్ పరిధిలోని ఐదు వార్డులకు నోడల్ ఆఫీసర్లను నియమించినట్టు చెప్పారు. 80వ వార్డుకు ఈఈ ఎస్.శేఖర్ 99480 78503 , 81వ వార్డుకు ఏపీడీ వై.సంతోష్‌కుమార్ 7729995938, 82వ వార్డుకు టీపీవో ఒ.వరప్రసాద్ 7729995916, 83వ వార్డుకు డీఈఈ కె.వేణుగోపాలకృష్ణ 73866 957240, 84వ వార్డుకు ఆర్ఐ పరదేశినాయుడు 94945 70367 నియమించామని పేర్కొంటూ వారి ఫోన్ నంబర్లను తెలియజేశారు. అవసరమైన వారు పైన పేర్కొన్న నంబర్లకు ఆయా అధికారులకు సమాచారం అందించాల్సిందిగా ఆయన సూచించారు. అలాగే జోనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ వద్ద 24 గంటలు అందుబాటులో ఉండేందుకు 15 మంది సిబ్బందిని నియమించినట్టు చెప్పారు.

విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తం

అనకాపల్లి రూరల్ : బంగాళాఖాతంలో ఈ నెల 27న అల్పపీడనం, తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేసినట్టు ఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్ జి.ప్రసాద్ తెలిపారు. ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అధికారులు, సిబ్బందిని సిద్ధం సిద్ధం చేసినట్టు చెప్పారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకుగాను జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఇక్కడ సిబ్బంది 24 గంటల పాటు మూడు షిఫ్ట్‌ల్లో అందుబాటులో ఉండి పర్యవేక్షిస్తారన్నారు. వర్షాల కారణంగా తెగిపడిన విద్యుత్ వైర్లను, తడిసిన విద్యుత్ స్తంభాలను, విద్యుత్ వైర్లు పడి ఉన్న చెట్ల కొమ్మలను ప్రజలు నేరుగా తాకవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

అన్నపూర్ణాదేవి ఆలయంలో లడ్డూల అలంకరణ



అనకాపల్లి టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సంతబయలు జంక్షన్‌లో గల అన్నపూర్ణాదేవి ఆలయంలో నిర్వాహకులు శనివారం లడ్డూలతో అలంకరించారు. కోరిబిల్లి ఆరుద్ర అనే భక్తుడు ఈ అలంకరణను చేపట్టారు. నాగుల చవితి సందర్భంగా పుట్టల్లో పాలు పోసేందుకు కుటుంబసమేతంగా ఆలయం మీదుగా వెళ్లే భక్తులంతా అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో కోలాహల వాతావరణం నెలకొంది.

ఈవీఎంల గోదాం వద్ద అప్రమత్తంగా ఉండండి : డీఆర్‌వో

అనకాపల్లి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఈవీఎంల గోదాం వద్ద సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని డీఆర్‌వో వై.సత్యనారాయణరావు సిబ్బందిని ఆదేశించారు. మాసాంతపు తనిఖీల్లో భాగంగా శనివారం జిల్లా పోలీసు కార్యాలయం ప్రాంగణంలో గల ఈవీఎం గోదామును ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, ప్రధాన ద్వారానికి ఉన్న శీళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా ప్రమాణాలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎస్‌వీఎస్ నాయుడు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


గోదామ్ వద్ద లాగ్ బుక్‌లో సంతకం చేస్తున్న డీఆర్‌వో

'ఓటరు జాబితాల్లో మార్పులు, చేర్పుల పై అభ్యంతరాలు తెలపండి'

ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులపై అభ్యంతరాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని డీఆర్‌వో సత్యనారాయణరావు రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మాసాంతపు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలోని సమస్యలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లాలనే లక్ష్యంతో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు కొత్తగా ఓటరు నమోదు కోసం, ఓటరు తొలగింపు కోసం, ఓటరు ఐడీ కార్డుల సవరణ కోసం 1883 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిలో 1163 దరఖాస్తులు పరిష్కరించామన్నారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

'వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వద్దు'

పరవాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వైద్య కళాశాలల పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ చేపట్టిన రచ్చబండ-కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం ఇక్కడి పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో మాట్లాడారు. వైద్య కళాశాలలను పీపీపీ పేరుతో ప్రైవేటు చేయడం పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడమే అవుతుందన్నారు. ఈ చర్యలను విడనాడాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, చుక్క రామునాయుడు, బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, గొర్లి గోపి, బొద్దపు చిన్నారావు, చల్లా కనకారావు తదితరులు పాల్గొన్నారు.

బాంబు పేలి ఇద్దరికి తీవ్ర గాయాలు

కొత్తూరు, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి పట్టణంలోని చేపల బజారు సమీపంలో ఉన్న పిల్లావారి వీధిలో ఓ ఇంట్లో బాంబులు చుడుతుండగా ప్రమాదవశాత్తు శనివారం చేతిలో పేలిపోయింది. ఈ ఘటనలో సుబ్రహ్మణ్యం, వాసు అనే ఇద్దరు అన్నదమ్ములు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరికి మండ భాగం తెగిపడింది. దీంతో క్షతగాత్రులను స్థానికుల సహాయంతో ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. వైద్యులు చికిత్సలు అందిస్తున్నారు. అయితే ఈ సంఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పట్టణ పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : తాడి - లంకెలపాలెం రైల్వే స్టేషన్ల మధ్య మూడు మదుముల వంతెన వద్ద రైలు ఢీకొన్న సంఘటనలో ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు జీఆర్పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి శనివారం విలేకరులకు తెలిపారు. 30 నుంచి 35 ఏళ్ల వయసు గల మృతుడు విశాఖ నుంచి విజయవాడ వెళ్లే ట్రాక్ పై గుర్తు తెలియని రైలు ఢీకొనడం వల్ల తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. అతను 5.3 అడుగుల ఎత్తు ఉండి నలుపురంగు హాఫ్ హ్యాండ్ టీషర్టు, బ్లూ కలర్ జీన్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, సంఘటనా స్థలం చుట్టుపక్కల ఎంత గాలించినా ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతుని ఆచూకీ గుర్తించిన వారు ఎవరైనా సెల్ నంబరు 73820 58996కు సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పది కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రింగురోడ్డులోని ఎన్టీఆర్ మార్కెట్ యార్డు సమీపంలో శనివారం తమిళనాడుకు చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి 10.960 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ సీఐ జి.ప్రేమ్‌కుమార్ తెలిపారు. బెల్లం మార్కెట్ ప్రాంతంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి వద్ద ఐదు ప్యాకెట్లతో ఉన్న గంజాయిని తమిళనాడులోని తిరువల్లూరు జిల్లాకు చెందిన శంకర్, ఆర్.అరవిందన్ కొనుగోలు చేశారన్నారు. ఆ గంజాయి ప్యాకెట్లను రెండు స్కూల్ బ్యాగ్‌ల్లో సర్దుకొని అనకాపల్లి నుంచి గంజాయిని తమిళనాడు రాష్ట్రంలో అధిక ధరకు అమ్ముకునేందుకు మార్కెట్‌యార్డు ప్రాంతం నుంచి రైల్వేస్టేషన్ వైపు వెళుతున్నారన్నారు. వీరి కదలికపై అనుమానం రావడంతో రింగురోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తున్న పట్టణ ఎస్ఐ సంతోశ్‌కుమార్, సిబ్బంది అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా గంజాయి బయటపడిందన్నారు. దీంతో వీరిద్దరిని అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అలాగే రెండు సెల్‌ఫోన్లు, నగదు రూ.1050లు కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన ఇద్దరిని కోర్టుకు తరలించినట్టు చెప్పారు.


పాడేరు సమీపతోటల్లో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు


జి.మాడుగులలో పుట్టలో పాలు, గుడ్లు పోస్తున్న భక్తులు


సీలేరులో నాగేంద్రునికి అయ్యప్పస్వాములు పూజలు

వాడవాడలా నాగులచవితి

పాడేరురూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాగుల చవితి వేడుకలను ప్రజలు వాడ వాడలా శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు కుటుంబ సమేతంగా సమీపంలో ఉన్న పుట్టల వద్దకు చేరుకొని పుట్టలో పాలు, గుడ్లు, సిమ్మిలి, చలివిడి తదితర వాటిని వేసి పూజలను చేపట్టారు. బాణసంచా కాల్చారు. పాడేరులో పుట్టలు సమీపంలో లేక పోవడంతో కిలోమీటర్లు మేర అటవీ ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది. అనంతరం పట్టణంలోని శివాలయాలను సందర్శించి పరమేశ్వరునికి పూజలు చేపట్టారు. అర్చకులు రామం పంతులు శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేపట్టారు. పాడేరులో ఉంటున్న రాజస్థాన్ మహిళలు ఉమానీలంతేశ్వరుని ఆలయానికి చేరుకుని శివలింగానికి పూజలు చేపట్టారు. పుట్ట వద్ద రాజస్థానీ ఆచారం మేరకు భక్తిగీత్పాజీ ఆల పించి నాగేంద్రునిపైభక్తిని చాటుకున్నారు. భక్తులకు ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు ఆధ్వర్యంలో ఆలయ ఆధ్యాత్మిక బృంద సభ్యులు కొట్టగుళ్లి రామారావు, వి.రాజబాబు, డి.బాబూరావు, ఎస్.శ్రీనివాస్ కుమార్ ప్రసాదం పంపిణీ చేపట్టారు.

కొయ్యూరు: గిరిజన పల్లెల్లో ఆచార వ్యవహారాలతో నాగుల చవితి పండుగను నిర్వహించారు. గిరిజన రైతులు పంట కాలాల్లో గట్లు, పుట్టల వద్దకు వెళ్లి పూజలు చేశారు. నాగ దేవత వల్ల అపాయం రాకుండా మొక్కులు తీర్చుకున్నారు. అలాగే, వివాహం కాని వారు నాగుల చవితి రోజున పుట్టలో పాలు పోసి ఉపవాసం ఉంటే పెళ్లి జరుగుతుందనే విశ్వాసం గ్రామాల్లో ఉంది. ఈ మేరకు పూజలు చేశారు.


పాడేరు ఉమానీలకంఠేశ్వర ఆలయంలో శివలింగానికి పూజలు

సీలేరు: స్థానిక మారెమ్మ ఆలయం వద్ద గల నాగేంద్రుని విగ్రహాల వద్ద ఆలయం పుట్టల వద్ద భక్తులు పాలు,గుడ్లు వేసి పూజలు చేశా రు. అలాగే మ న్యం శబరిమలై ఆలయంగా పేరొందిన స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో మాలధారులు నాగేంద్రునికి అర్చకుడు దామోదర స్వామి ఆధ్వర్యంలో పాలాభిషేకాలు, ప్ర త్యేక పూజలు నిర్వహించారు.

జి.మాడుగుల: జి.మాడుడుల, మద్దిగరువు, నుర్మతి, సంతబయలు, బందవీధి, ఎం.నిట్టాపుట్టు నాగులచవితి సందడి నెలకొంది.సమీప పుట్టల వద్దకు వెళ్లి భక్తులు చలిమిడి, పాలు, గుడ్లు సమర్పించారు.

సమస్యలపై వైద్య ఉద్యోగుల వినతి


డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

పాడేరురూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో వైద్య ఆరోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని గిరిజన ప్రాంత ఆరోగ్య ఉద్యోగుల సంఘం నాయకుడు వెట్టి నాగరాజు కోరారు. ఈ మేరకు సంఘ నాయకులతో కలిసి శనివారం డీఎంహెచ్‌వో డి.కృష్ణమూర్తిని కలిసి వినతిపత్రం అందించారు. గిరిజన ప్రాంతంలోని క్షేత్ర స్థాయిలో ఉద్యోగులు ఆన్‌లైన్ వర్క్‌లు చేసేందుకు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు వివరించారు. అలాగే, గత ప్రభుత్వ హయాంలో రెగ్యుల రైన 78 మంది హెల్త్ అసిస్టెంట్ల సర్వీసు రెగ్యులైజేషన్, పోలీస్ విచారణ కొలిక్కిరాలేదని ఆయనకు వివరించారు. సంఘ నాయకులు ఎస్పీ పడాల్, మురళి, బాలయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఇద్దరి ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చింతపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాజులపాలెం గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఇద్దరు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయులు కె. ప్రసాద రావు తెలిపారు. శుక్రవారం అచ్చుతాపురంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడల్లో పాఠశాలకు చెందిన క్రీడాకారులు అండర్-17 వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నారన్నారు. పదోవ తరగతి చదువుతున్న పాంగి గోవింద్, తొమ్మిదోవ తరగతి చదువుతున్న గెమ్మెలి ప్రకాశ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను పీడీ ఎస్. జోసెఫ్, హెచ్‌ఎం అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో గిరిజనుడి మృతి


మృతి చెందిన రెడ్డి దావీదు

చింతపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చింతపల్లి జాతీయ రహదారిపై పెంటపాడు బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అడ్డతీగల మండలం సోమన్నపాలెం గ్రామానికి చెందిన ఓ గిరిజనుడు మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.అడ్డతీగల మండలం సోమన్నపాలెం గ్రామానికి చెందిన రెడ్డి దావీదు(30) కొంతకాలంగా గూడెంకొత్తవీధి మండలం సుర్రవరంలోని అత్తవారి ఇంట్లో భార్య, పిల్లలతో వుంటున్నాడు. ఆయన సర్వీసు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం కుమారుడు ఆడుకునేందుకు మూడు చక్రాల సైకిల్ కొనుగోలు చేసేందుకు ద్విచక్రవాహనంపై చింతపల్లి వచ్చాడు. సైకిల్ కొనుగోలు చేసుకుని ద్విచక్రవాహనం అత్తవారి గృహానికి ప్రయాణమయ్యాడు. పెంటపాడు బ్రిడ్జి మలుపు వద్ద పెట్రోల్ ట్యాంక్ వద్ద నున్నమూడు చక్రాల సైకిల్ బాక్స్ వాహనం హ్యాండిల్ తిరగకుండా అడ్డుకుంది. దీంతో బైక్ అదుపుతప్పి బ్రిడ్జి రక్షణ గోడను బలంగా ఢీకొనడంతో దావీదు పడిపోవడంతో తలబలమైన గాయమైసంఘట నా స్థలంలోనే మృతి చెందాడు. ఈ ఘటనపై చిం తపల్లి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. దావీదుకు భార్య, కుమారుడు ఉన్నారు.

అనారోగ్యంతో బాలిక మృతి


మృతిచెందిన అంజలి

అనంతగిరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీంపోల్ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న ఎస్. అంజలి అనారోగ్యంతో శనివారం సాయంత్రం మృతిచెందింది. కొత్తూరు పంచాయతీ చీడివలసకు చెందిన అంజలి భీంపోల్‌లో చదువుతోంది. శనివారం పాఠశాల నుంచి బాలికను కు టుంబ సభ్యులు ఇంటికి తీసుకువెళ్లారు. సాయంత్రం అస్వస్థతకు గురికావడంతో ఇంటినుంచి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందింది. పాఠశాలలో విద్యా ర్థిఆరోగ్యంగానే ఉందని సిబ్బంది తెలిపారు. శుక్రవారం పాఠశాలలో వైద్యశిబిరంలోని బాలికకు పరీక్షలు చేశారని, రిపోర్టు బాగానే వచ్చినట్టు వారు చెబుతున్నారు.

అంకితభావంతో వైద్య సేవలందించాలి

▸▸ డీఎంహెచ్‌వో కృష్ణమూర్తినాయక్


పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

డుంబ్రిగుడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది అంకితభావంతో పని చేసి గిరిజనులకు మెరుగైన సేవలందంచాలని డీఎంహెచ్‌వో బి, కృష్ణమూర్తినాయక్ అన్నారు. శనివారం మండలంలోని కిల్లోగుడ పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. రోజు వారీ రికార్డులను పరిశీలించారు. సిబ్బందిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనం తరం సున్నమెట్ట గ్రామంలో నిర్వహించిన ఫిజిషియన్ క్యాంపును సందర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. గ్రామంలో ఎవరికైనా జ్వరాలు వస్తే తక్షణమే వైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. పీహెచ్‌సీ అందిస్తున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ పుష్ప, హెల్త్ అసిస్టెంట్లు సోమర, ప్రభాకర్, స్వామి పోతురాజు, ఏఎన్‌ఎం భాను, శకుంతల ఎంఎల్‌హెచ్‌పీ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ నేపథ్యంలో అప్రమత్తం


మాట్లాడుతున్న తహశీల్దార్ రాజ్‌కుమార్

జి.మాడుగుల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నేటి నుంచి ఏర్పడే తుపాన్ ప్రభావం దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మూడు రోజుల పాటు వర్షాలు కొనసాగే అవకాశాలు ఉన్నందున ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలన్నారు. చెట్లు, పాడు బడిన భవనాలు, ఇళ్లల్లో ఉండరాదని, ప్రయాణాలు వాయిదాలు వేసుకోవాలని శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

నేటి నుంచి వాయుగుండం ప్రభావం

డుంబ్రిగుడ: వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక తహశీల్దార్ త్రివేణి అన్నారు. ఈనెల 26 నుంచి 29 వరకు భారీ వర్షాలు పడే అవకాశముందన్నారు. ప్రజలకు ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ దినేశ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారన్నారు. 28న అర్ధరాత్రి తుఫాన్ తీరం దాటే వీలుందన్నారు. ఈ స్థితిలో 26 నుంచి నాలుగు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను దండోరా వేసి ప్రజలకు అప్ర మత్తం చేయాలని సిబ్బందికి సూచించారు. నిత్యావసరాలను ముందుగా పంపిణీ చేయాలన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే


బొడ్డపల్లిఆశ్రమ పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

పెదబయలు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం సూచించారు. మండలంలోని బొడ్డపల్లి ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలను శనివారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించి అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేశారు. విద్యార్థులు సమాధానాలు సరిగా చెప్పలేకపోవడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం నిట్టపుట్టు ఎంపీపీ పాఠశాలను సందర్శించారు. నూతన పాఠశాల భవనం కావాలని గ్రామస్థులు ఆయనను కోరారు. అనంతరం మగ్గంవీధి పాఠశాలకు సందర్శించారు.

‘ఆత్మ నిర్భర్’పై అవగాహన


మాట్లాడుతున్న రాష్ట్ర ట్రైకార్ డైరెక్టర్ కృష్ణారావు

గూడెంకొత్తవీధి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత ప్రజలు స్వదేశీ ఉత్పత్తులనే వినియోగించాలని రాష్ట్ర ట్రైకార్ డైరెక్టర్ కూడా కృష్ణారావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు కాకూరు శేఖర్ అధ్యక్షతన స్వయం ఆధారిత భారతదేశం కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా కృష్ణారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆత్మ నిర్భర్‌కు ప్రతి ఒక్కరూ మద్దతివ్వాలన్నారు. విదేశీ వస్తువులు వద్దు, స్వదేశీ వస్తువులు ముద్దు అన్న నినాదాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు రీమల రాజేశ్వరి, పార్టీ నాయకులు అచ్చుత్, పాల్, బొండ్ల చిరంజీవి, ఎం.లక్ష్మణరావు, రామ్‌కిరణ్, చిన్నబాబు, ప్రభాకరరావు, ప్రసాద్, కోటి, జిల్లా ఐటీడీపీ కన్వీనర్ పండ ఈశ్వరరావు పాల్గొన్నారు.

30న శ్రీనివాస కల్యాణం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆధ్యాత్మిక సేవా సంఘం అధ్యక్షులు, సభ్యులు

పాడేరు రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ గురువారం పాడేరులో నిర్వహించనున్న శ్రీనివాస కళ్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గోవాలని ఆధ్యాత్మిక సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కొట్టగుళ్లి సింహాచలం నాయుడు కోరారు. స్థానిక ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం ఆయన ఆధ్యాత్మిక బృంద సభ్యులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక సేవా సంఘం ప్రతినిధులు చీపురు రమాదేవి, ఆలయ అర్చకులు రామం పంతులు, నృత్య సంగీత గురువు చైతన్య ప్రభు, ఉప్పల వెంకటరత్నం, సిద్ధినాతి కొండలరావు, వంతినిబ రాజబాబు, కల్యాణం నిర్వాహకులు కె.సతీశ్, బి.నాని, సురేశ్, మూర్తి, వేణమ్మ, కుమారి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పాడేరురూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ విలువలపై విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మండల స్థాయి పోటీలలో విజేతలుగా నిలి చిన విద్యార్థులకు స్థానిక ప్ర భుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.విశ్వప్రసాద్, జిల్లా నోడల్ అధికారి బి.దిలీప్ కుమార్‌లు అభినందించారు. ఈ సందర్భంగా బి.దిలీప్ కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, విధులు, చట్టాలపై మండల సాయిలో పోటీలను నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో ప్రభుత్వ ఉన్నతపాఠశాలకు చెందిన విద్యార్థిని ముగ్గు నవ్యశ్రీ, రాయిగెడ్డ పాఠశాలలోని 10వ తరగతి బి.మేఘణ, లోచలిపుట్టుకు చెందిన 8వ తరగతి విద్యార్థి బి.సింహాద్రి ప్రతిభను చూపి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

వాలీబాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక


రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయులు

ముంచంగిపుట్టు: కిలగాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థి కె.అరుణ్‌బాబు అండర్ 17 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎం పియ్యాడు. అచ్యుతాపురంలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన వాలీబాల్ పోటీలో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపియ్యాడు.హెచ్‌ఎం. టి.భాస్కరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

పట్టుదలతో చదివితేనే ఫలితాలు : ఎంఈవో



మాట్లాడుతున్న ఎంఈవో త్రినాథరావు

అరకులోయ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విలువలతో కూడిన విద్య నభ్యసించాలని ఎంఈవో త్రినాధరావు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు పొందిన మొదటి సంవత్సరం విద్యార్థినుల పరిచయ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు ఎంతో శ్రమకోర్చి తమ బిడ్డలు మంచి ఉద్యోగాల్లో చక్కగా స్థిరపడాలని ఎన్నో ఆశలతో చదివిస్తారని వారి ఆశలను నెరవేర్చేలా ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. రిటైర్డ్ పీడీ బురిడి ఆనందరావు మాట్లాడుతూ, పట్టుదలతో చదివి చక్కటి ఫలితాలు సాధించాలన్నారు. ప్రిన్సిపాల్ చలపతిరావు మాట్లాడుతూ డిగ్రీ కళాశాలలో ప్రస్తుతం మరో 160 సీట్లు ఖాళీలున్నాయని, అర్హులు వచ్చిచేరాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం అతిథులను సన్మానించారు. ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం హుస్సేన్, స్టూడెంట్స్ ఇండక్షన్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ సుబాన్ బొడ్నాయిక్, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు, అధ్యాపకులు డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

‘జీఎస్టీ తగ్గింపుతో మధ్య తరగతి కుటుంబాలకు మేలు’

పెదబయలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతోమేలు చేకూరుతుందని టీడీపీ అరకు పార్లమెంట్ కోశాధికారి వంతల నాగేశ్వరరావు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు అశోక్ అన్నారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. సామాన్యులకు తక్కువ ధరలతో అవసరాలకు వినియోగించలన్నాదే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ ప్రసాద్, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉంటేనే యువతకు భవిష్యత్తు: డీఎస్పీ

ముంచంగిపుట్టు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): యువత వ్యసనాలకు దూరంగా ఉంటేనే భవిష్యత్తు ఉంటుందని పాడేరు డీఎస్పీ షేక్ షహబాజ్ అహమ్మద్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. మండల పరిధిలో శాంతిభద్రతలు, గంజాయి కేసుల వివరాలు, మావోల కదిలికలు తదితర వాటిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక వారపు సంతలో పర్యటించారు. గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తర్వాత జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు ఏకలవ్య పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశ కార్యక్రమంలో డీఎస్పీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాల అధిరోహణకు విద్య ఎంతో కీలకమని అన్నారు. పిల్లల న డవడికను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని సూచించారు. యువత గంజాయి రవాణా, సాగు చేస్తూ జైలు పాలు అవుతున్నారని అ న్నారు. పాఠశాలలో తాగునీటి సమస్యను తల్లిదండ్రులు డీఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఏకలవ్య ప్రిన్సిపాల్ సుమన్, ఎస్‌ఐ జె.రామకృష్ణ, వివిధ పార్టీల నేతలు, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ షేక్ షహబాజ్ అహమ్మద్

వైసీపీ పాలనలో జీసీసీ నిర్వీర్యం

▸▸ జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ ధ్వజం


మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్, తదితరులు

పాడేరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థను గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ విమర్శించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి పాలనలో జీసీసీని బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నా, వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన ఖండించారు. ఏ విషయంలోనూ కూటమి ప్రభుత్వ చర్యలను విమర్శించే నైతిక హక్కు వైసీపీ నేతలకు లేదన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జీసీసీ అభివృద్ధిని పట్టించుకోకుండా తిరిగిని దానిని క్రమంగా నిర్వీర్యం చేశారని ఆయన ఆరోపించారు. 2020లోనే జీసీసీ చెందిన గోదాములను పౌరసరఫరాల శాఖకు అప్పగించాలని అప్పటి జీసీసీ ఎండీ ప్రభుత్వానికి లేఖ రాశారని, వాటి నకలును శ్రావణ్‌కుమార్ ప్రదర్శించారు. వైసీపీ హయాంలోనే జీసీసీ గోదాముల సివిల్ సప్లై శాఖకు అప్పగించాలని చర్యలు ప్రారంభించి, ఇప్పుడు తమపై వైసీపీ నేతలు విమర్శలు చేయడం తగదన్నారు. వాస్తవాలను గ్రహించాలని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జీసీసీలో అధికారులు, ఉద్యోగులకు పదోన్నతుల కల్పన, కాఫీ రైతులను ప్రోత్సహించడం తదితర వాటిని అమలు చేస్తున్నామన్నారు.వైసీపీ పాలనలో జీసీసీ ఉద్యోగులకు, కాఫీ రైతులకు సైతం అన్యాయం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు బాకూరు వెంకటరమణ, సాగర సుబ్బారావు, పాండురంగ స్వామి, జగన్నాథ్, సుందరావు, త్రినాథ్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

వరిలో తెగుళ్లను నియంత్రించాలి

చింతపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ రైతులు వరి పోలాల్లో ఆశించిన ఆకుముడు, అగ్గి తెగుళ్లను సకాలంలో నియంత్రించాలని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె. బయ్యపురెడ్డి అన్నారు. శనివారం శాస్త్రవేత్తల బృందం వ్యవసాయశాఖ అధికారులతో కలిసి రాజుపాకలు, చీకటిమామిడి గ్రామాల్లో పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త మాట్లాడుతూ వరిలో ఆకుముడ, అగ్గి తెలుగు ఆశించినట్టు గుర్తించామన్నారు. అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ పొడి మందుని 0.6గ్రాములు లీటరు నీటిలో కలుపుకుని, ఎకరాకు 200 లీటర్లు చొప్పున పిచికారీ చేయాలన్నారు. ఆకుముడతకు లీటరు నీటిలో 2.5 మిల్లీ లీటర్ల క్లోరిపైరిపాస్ మందు కలిపి ఎకరాకు 200లీటర్ల ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలన్నారు. అనంతరం కొలపరి గ్రామంలో పాడేరు ఏరువాక కేం ద్రం, టాటా ట్రస్టు సంయుక్తంగా ఆదివాసీ రైతులతో సాగు చేయిస్తున్న ఉత్కల్ నైజర్ 150 రకం వలిసెల పంటను శాస్త్రవేత్తలు పరిశీలించారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి. బాల హుస్సేన్ రెడ్డి, శాస్త్రవేత్త పి.జోగారావు, ఏవో మధుసుదనరావు, టాటా ట్రస్టు సాంకేతిక నిపుణుడు డాక్టర్ అప్పలరాజు, వీఏఏ చంద్రకళ పాల్గొన్నారు.

తుఫాన్‌పై అప్రమత్తం

... 5వ పేజీ తరువాయి

ఉద్యోగులకు సెలవులు రద్దు చేశారు. జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు, ఉద్యోగులు పనిచేసే ప్రదేశాల్లో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. రానున్న నాలుగు రోజుల్లో ఉద్యోగులకు అత్యవసరం అయితే తప్ప సెలవులు ఇవ్వరాదని అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని, ఎవరైనా సముద్రంలోకి ఇప్పటికే వెళ్లి ఉంటే ఒడ్డుకు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులకు సూచించారు. తీర ప్రాంతాలైన పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, ఎలమంచిలి, అచ్యుతాపురం, పరవాడ మండలాల్లో అధికారులతో కలెక్టర్ మాట్లాడి పలు సూచనలు చేశారు. అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ జాహ్నవి, డీఆర్‌వో సత్యనారాయణరావు, పీఆర్, రోడ్లు, భవనాలు, పోలీసు, అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తక్షణ సహాయక చర్యలు అందించే ఉద్దేశంతో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. డివిజన్, మండల కేంద్రాల్లోనూ రానున్న మూడు రోజుల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి, మండలాల్లో వరద తీవ్రతపై ఎప్పటికప్పుడు సమాచారం అందించేలా ఏర్పాట్లు చేశారు.

కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబర్లు: 08924 222888, 08924225999, 08924226599

మహిళల ఉపాధికి భరోసా

... 5వ పేజీ తరువాయి

ఉపాధి పొందే విధంగా తీర్చిదిద్దారు. మూడు నెలల శిక్షణలో 75 శాతం హాజరు కలిగిన ప్రతి మహిళకు శిక్షణ పొందినట్లు ధ్రువీకరణ పత్రంతో పాటు బీసీ కార్పొరేషన్ ద్వారా ఉచితంగా రూ.6,199 విలువ చేసే కుట్టు మిషన్‌ను అందజేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అనకాపల్లి, అచ్యుతాపురం, కశింకోట, చోడవరం, నర్సీపట్నం, మాడుగుల, పాయకరావుపేట కేంద్రాల్లో కుట్టు శిక్షణ పొందేందుకు బీసీ మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి శిక్షణ పొందారు.

శిక్షణ కోసం రిజిస్ట్రేషన్లు

కుట్టు శిక్షణ పొందేందుకు ఆసక్తి గల మహిళలు మండల అభివృద్ధి కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకొనే అవకాశాన్ని కల్పించారు. దరఖాస్తులు అందిన తరువాత ఆయా మహిళల వివరాలను మ్యాపింగ్ చేయడం ద్వారా కుట్టు శిక్షణ శిబిరానికి ఆహ్వానిస్తారు. జిల్లాలో రెండో విడత కింద మరో మూడు వేల మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాటు చేస్తున్నారు. త్వరలోనే రెండో ధశ కుట్టు శిక్షణ శిబిరాలను ప్రారంభించనున్నారు. ఈ అవకాశాన్ని అర్హత కలిగిన ప్రతి బీసీ మహిళ సద్వినియోగం చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఈడీ జ్యోతిశ్రీ కోరారు.

ఎంఎస్‌ఎంఈ పార్కుకు భూమి సిద్ధం

... 5వ పేజీ తరువాయి

వచ్చిన తరువాత ఇక్కడ ఎంఎస్‌ఎంఈ పార్కు నిర్మించాలని నిర్ణయించడంతో ఈ భూమిని రైతుల నుంచి రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో భాగంగా గత నెల రోజులుగా ఈ భూమిలో ఉన్న వ్యవసాయ పంటలతో పాటు చెట్లను తొలగించారు. నవంబరు నెలలో ఇక్కడ ఎంఎస్‌ఎంఈ పార్కు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారని ప్రచారం జరుగుతోంది. పార్కు నిర్మాణం కోసం భూమి పనులు పూర్తి చేసినట్టు రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.

సోలాపూర్ ప్రత్యేక రైలు వెలవెల

... 5వ పేజీ తరువాయి

ప్రారంభమైన రైలులో ప్రయాణికుల సంఖ్య అంతంత మాత్రంగానే కనిపించింది. ఈ రైలు ప్రతీ శనివారం అనకాపల్లి నుంచి సోలాపూర్‌కు నవంబరు 29వ తేదీ వరకు నడుస్తుందని రైల్వే అధికారులు చెబుతున్నారు. సోమవారం తిరుపతికి ప్రత్యేక రైలు ఉంది. సోలాపూర్ రైలు కూడా తిరుపతి మీదుగా వెళ్లడంతో తిరుమల శ్రీనివాసుని దర్శనానికి వెళ్లే భక్తులకు ఉపయోగకరంగా ఉంటుందని రైల్వే అధికారులు చెబుతున్నారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ రైల్వే స్టాండింగ్ బోర్డు చైర్మన్‌గా ఉండడంతో అనకాపల్లి నుంచి ఎన్నడూ లేనివిధంగా ప్రత్యేక రైళ్లు ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చాయి. సోమవారం తిరుపతికి, మంగళవారం సికింద్రాబాద్‌కి, బుధవారం నాందేడ్, శుక్రవారం కాచిగూడ, శనివారం సోలాపూర్‌లకు ప్రత్యేక రైళ్లు ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చాయి. సోమవారం అనకాపల్లి నుంచి వెళ్లే తిరుపతి స్పెషల్‌కు స్లీపర్ బోగీలు కూడా ఏర్పాటు చేయడంతో ప్రయాణికులకు రిజర్వేషన్ దొరికే అవకాశాలున్నాయని రైల్వే అధికారులు చెబుతున్నారు.

13న బెంగళూరుకు ప్రత్యేక రైలు

అనకాపల్లి నుంచి బెంగళూరుకు నవంబరు 13వ తేదీన ప్రత్యేక రైలు అందుబాటులోకి రానున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో ప్రశాంతి నిలయం సమీపంలోని ఎలహంకకు ఈ రైలు సత్యసాయి భక్తుల కోసం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.

విద్యుత్ అంతరాయాలపై కంట్రోల్ రూమ్

» ఈపీడీసీఎల్ ఏడీఈ సురేశ్‌కుమార్

చోడవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉండడంతో విద్యుత్ అవాంతరాలపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని ఈపీడీసీఎల్ ఏడీఈ వై.సురేశ్‌కుమార్ శనివారం తెలిపారు. భారీ వర్షాల వల్ల కలిగే విద్యుత్ సరఫరా అంతరాయాలు, ఇతరత్రా సమస్యలపై స్పందించేందుకు వీలుగా అనకాపల్లిలోని విద్యుత్ సెక్షన్ కార్యాలయం లేదా, అనకాపల్లిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 9490610022 లేదా 1912 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికలతో ప్రజలను అప్రమత్తం చేయడానికి కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు తహశీల్దార్ పి.లక్ష్మీదేవి శనివారం విలేకరులకు తెలిపారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు సిబ్బందిని ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రజలకు ఎటువంటి అవసరం వచ్చినా 08934-294458 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. ప్రజల ఇబ్బందులపై స్పందించని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడో విడత ప్రవేశాలు

చోడవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడో విడత ప్రవేశాల కోసం ఉన్నత విద్యా శాఖ ఆదేశాలు జారీ చేసిందని ప్రిన్సిపాల్ డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 25, 26 తేదీలలో విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అలాగే 28, 29 తేదీలలో ఆప్షన్ ఎంపిక చేసుకోవాలని చెప్పారు. బీఏ, బీకాం, బీఎస్సీ జువాలజీ, కెమిస్ట్రీ కోర్సులలో సీట్లు ఉన్నాయని, ఆసక్తి కలిగిన విద్యార్థులు స్వయంగా కళాశాలకు వచ్చి కూడా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చన్నారు. ఇందుకోసం అడ్మిషన్ల కోఆర్డినేటర్లు డాక్టర్ నారాయణమూర్తి 8247470250, డాక్టర్ మల్లిబాబు 9966545448 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం పొందవచ్చని ప్రిన్సిపాల్ సూచించారు.

నీటి తీరువాపై స్పెషల్ డ్రైవ్

బుచ్చెయ్యపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో నీటి తీరువాపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తహశీల్దార్ ఎం.లక్ష్మి తెలిపారు. బకాయిలను రైతులు ఒకేసారి కాకుండా విడతల వారీగా చెల్లించవచ్చని చెప్పారు. వడ్డాదిలో ఇనాం భూమి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. అలాగే తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర సేవల కోసం ప్రజలు 08934-247857 నంబరుకు కాల్ చేయాలని ఆమె సూచించారు.

విద్యుత్ లైన్‌కు దూరంగా మొక్కలు నాటాలి

బుచ్చెయ్యపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్ లైన్‌కు ఆరు మీటర్ల దూరంలో సరుగుడు మొక్కలు నాటాలని ఈపీడీసీఎల్ వడ్డాది సెక్షన్ ఏఈ రాజు విజ్ఞప్తి చేశారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ సరుగుడు తోటల వల్ల విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతుందని చెప్పారు. ప్రధానంగా చింతపాక, పెదపూడి, సీతయ్యపేట పరిధిలో గ్రామాల్లో ఈ సమస్య ఉందన్నారు. ఈ విషయంలో రైతులు స్పందించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

నేడు మెగా వైద్య శిబిరం

రోలుగుంట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంచుగుమ్మలలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు తాసుబెల్లి ఫౌండేషన్ ఆర్గనైజర్ పీఎస్ మూర్తి తెలిపారు. ఈ శిబిరంలో విశాఖ కేర్ ఆసుపత్రి, వాసన్ ఐకేర్, సాయి దివ్యస్ డెంటల్ క్లినిక్‌కు చెందిన ప్రముఖ వైద్యులు పాల్గొంటారని తెలిపారు. కంటి, దంత, వినికిడి, ఊపిరితిత్తులు, గుండె సంబంధిత పరీక్షలు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



నర్సీపట్నం: పుట్టలో పాలు పోస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు



రోలుగుంట: కొవ్వూరులో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



రావికమతం: కొత్తకోట గ్రామంలో పుట్టకు మొక్కుతున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో నాగులచవితి వేడుకలు

నర్సీపట్నం/మాకవరపాలెం/గొలుగొండ/కృష్ణాదేవిపేట/నాతవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో శనివారం నాగులచవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కుటుంబ సమేతంగా భక్తులు పుట్టల్లో పాలు పోసి ప్రత్యేకంగా పూజలు చేశారు. నర్సీపట్నంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు కుటుంబ సమేతంగా పుట్టలో పాలు, గుడ్లు పోసి నాగదేవతకు పూజలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లాలని, దీనికి ప్రజలు భాగస్వామ్యం కావాలని స్పీకర్ కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ పాల్గొన్నారు. పట్టణంలోని సబ్ కలెక్టర్, తహశీల్దార్ కార్యాలయాలు, ఎన్టీఆర్ మినీ స్టేడియం, ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్, శివపురంలోని ప్రాంతాల్లో భక్తులు పుట్టలో పాలు పోసి పూజలు చేశారు.

మాకవరపాలెం మండల కేంద్రంతో పాటు తామరం, రాచపల్లి, గిడుతూరు, కొండల అగ్రహారం, బూరుగుపాలెం గ్రామాల్లో చవితి పండుగను ఘనంగా నిర్వహించారు. వ్యవసాయదారులు పొలాల్లోకి వెళ్లి పుట్టల్లో పాలు పోసి నాగేంద్రుడిని పూజించారు. గొలుగొండ మండల కేంద్రంతో పాటు జోగంపేట, పాతమల్లంపేట, అమ్మపేట, పాకలపాడు, చీడిగుమ్మల, కొత్తఎల్లవరం, ఏటిగైరంపేట, కృష్ణాదేవిపేట, చోద్యం, పాతకృష్ణాదేవిపేట, లింగంపేట, కొంగసింగి గ్రామాల్లో ఉదయం నుంచి భక్తులు పుట్టల వద్ద పూజలు నిర్వహించారు. నాతవరం మండలంలో అన్ని గ్రామాల్లో నాగులచవితిని ఘనంగా నిర్వహించారు.



చోడవరంలోపుట్ట వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు దంపతులు

చోడవరం నియోజకవర్గంలో...

చోడవరం/రావికమతం/బుచ్చెయ్యపేట/రోలుగుంట: చోడవరం నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల్లో నాగులచవితి పండుగ సందడిగా సాగింది. ఉదయం నుంచే భక్తులు కుటుంబ సమేతంగా పుట్టల వద్దకు చేరుకుని పూజలు చేశారు. చోడవరంలోని పీఎస్‌పేట, బంగారమ్మపాలెం, గోవాడ, లక్కవరం, ఎడ్లవీధి తదితర ప్రాంతాల్లో భారీ సంఖ్యల్లో ప్రజలు పుట్టల వద్దకు బారులుతీరారు. పట్టణంలోని కోటవీధి సమీపంలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు దంపతులు పుట్టలో పాలుపోసి వేడుకల్లో పాల్గొన్నారు.

రావికమతం మండలంలో గ్రామగ్రామాన నాగుల చవితి ఘనంగా జరిగింది. కొత్తకోటలో సోమిరెడ్డి, ఉగ్గినవారి కుటుంబాలు ఒకే చోట పుట్టకు పూజలు జరిపారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, చిటికల భజన, హరి భజనల పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ చూపిన గురువులను టీడీపీ మండల ఉపాధ్యక్షుడు సాలాపు రమేశ్, గ్రామ మాజీ సర్పంచ్ కర్రి అర్జున సత్కరించారు.

బుచ్చెయ్యపేట మండలంలో నాగుల చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామాల్లోని చెరువు గట్లు, పొలాల మధ్య ఉన్న పుట్టలలో భక్తులు పాలు, గుడ్లు పోసి పూజలు చేశారు. కుటుంబ సమేతంగా వెళ్లి నాగేంద్రుని పూజించారు. దీంతో పొలాలు, చెరువు గట్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. పలు శివాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుచ్చెయ్యపేటలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. రోలుగుంట మండలంలోని కొవ్వూరులో ఐటీడీపీ ఇన్‌చార్జి బంటు రాజు ఆధ్వర్యంలో వేడుకులను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పొలాల్లో ఉన్న పుట్టల వద్దకు వెళ్లి నాగేంద్రునికి పువ్వులు, వస్త్రాలు, పాలు, గుడ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అక్కడే బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

మాడుగుల నియోజకవర్గంలో...

మాడుగుల/మాడుగుల రూరల్/దేవరాపల్లి/కె.కోటపాడు/చీడికాడ: మాడుగుల నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో నాగుల చవితి వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. మాడుగుల మండలంలో చిన్నారులు, పెద్దలు సంప్రదాయ దుస్తులతో పంట పొలాల్లోని పుట్టల వద్దకు వెళ్లి పాలు, గుడ్లు, చిమ్మిడి వేసి నాగేంద్రునికి పూజలు చేశారు. కె.కోటపాడులో భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పుట్టల్లో పాలు, నువ్వుల చిమ్మిడి, కోడిగుడ్లు, తాటిగుంజు పోసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పొలం పనులకు వెళ్లే తమను కాపాడాలని నాగేంద్రస్వామిని వేడుకున్నారు. దేవరాపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలను జరుపుకున్నారు. గ్రామాల్లోని పొలాల్లో పుట్టల వద్దకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి అంతా ఒకే చోట పాలు పోసి నాగేంద్రునికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఎ.కొత్తపల్లిలో ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, సర్పంచ్ చింతల వెంకటరమణ నాగేంద్రునికి పాలు పోసి పూజలు చేశారు. చీడికాడ మండలంలోని పలు గ్రామాల్లో నాగుల చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీపావళి అమావాస్య జరిగిన ఆరో రోజు ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటలలోపు ఈ పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో తమ మొక్కులు తీర్చుకున్నారు. పుట్టల వద్దకు వెళ్లి పాలు, గుడ్లు, చిమ్మిడి వేసి నాగేంద్రునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జాతీయ స్థాయి వూషూ పోటీలకు నర్సీపట్నం క్రీడాకారులు

నర్సీపట్నం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే 69వ జాతీయ స్థాయి వూషూ చాంపియన్‌షిప్ పోటీలలో నర్సీపట్నానికి చెందిన ముగ్గురు క్రీడాకారులు పాల్గొంటున్నారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో చదువుతున్న నకిరెడ్డి హారిణి అండర్-17 బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. అదే విధంగా సాంఘిక సంక్షేమ అంబేడ్కర్ గురుకుల బాలిక పాఠశాలలో చదువుతున్న లండ ఐశ్వర్య (65 కిలోలు), బొమ్మల ప్రేమ జ్యోతి (60 కిలోలు) కూడా బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరితో పాటు కోచ్ వేపాడ ప్రియాంక జమ్మూకాశ్మీర్ బయలుదేరి వెళ్లారు. నింజాస్ అకాడమీ డైరెక్టర్ సుతాపల్లి శ్రావణ్, వెలగా నారాయణరావు, జగన్నాథరావు క్రీడాకారులను అభినందించారు. జాతీయ స్థాయిలో రాణించి పతకాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.



పోటీలకు ఎంపికైన బాక్సింగ్ క్రీడాకారులు వీరే..

రైవాడ జలాశయానికి పోటెత్తిన పర్యాటకులు

దేవరాపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైవాడ జలాశయానికి శనివారం పర్యాటకులు పోటెత్తారు. నాగులచవితి పండుగను పురస్కరించిన వివిధ ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన జనంతో పాటు పర్యాటకులు అధికంగా తరలివచ్చారు. జలాశయంలో నీరు ఎక్కువగా ఉండడంతో బారులు తీరి తిలకించారు. అలాగే కుటుంబ సభ్యులతో కలిసి వారంతా సందడి చేశారు. జలాశయం వద్ద ప్రమాదాలు జరగకుండా ఎస్ఐ సత్యనారాయణ ముందస్తు చర్యలు చేపట్టారు. జలాశయం వరకు వాహనాలు వెళ్లకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



రైవాడ జలాశయం గట్టుపై బారులు తీరిన పర్యాటకులు

పోలేపల్లి భూముల్లో ఆక్రమణల తొలగింపు

బుచ్చెయ్యపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలేపల్లి ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు తొలగించారు. పోలేపల్లి రెవెన్యూలోని సర్వే నంబరు 156లో 216 ఎకరాల ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు పాల్పడుతున్నారని సర్పంచ్ సీతా పైడినాయుడు ఎమ్మెల్యే రాజు, తహశీల్దార్ ఎం.లక్ష్మికి ఫిర్యాదు చేశారు. అలాగే శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఈ అంశాన్ని లేవనెత్తి రెవెన్యూ అధికారులను నిలదీశారు. దీంతో తహశీల్దార్ లక్ష్మి, ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వో తరుణ్ శనివారం సిబ్బందితో ఈ భూముల్లోకి వెళ్లి ఆక్రమణదారులు నాటిన మొక్కలను తొలగించారు. అలాగే హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ భూముల్లో ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా తహశీల్దార్ హెచ్చరించారు. ఈ భూములపై నిరంతరం నిఘా ఉంటుందని స్పష్టం చేశారు.



ఆక్రమిత భూమిలో మొక్కలు తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

రాచపల్లిలో స్తంభించిన బ్యాంకు సేవలు

మాకవరపాలెం, అక్టోబరు 25 (ఆంధ్ర జ్యోతి): రాచపల్లి సెంటరులోని గ్రామీణ బ్యాంకు సేవలు నిలిచిపోయాయి. బ్యాంకుకు అత్యధిక సంఖ్యలో ఖాతాదారులు ఉన్నారు. నెల రోజులుగా నగదు లావాదేవీలు నిలిచిపోయాయి. ఏటీఎం సేవలు కూడా స్తంభించడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజూ ఖాతాదారులు బ్యాంకుకు వెళ్లి తమ ఖాతాలను అప్‌డేట్ చేసుకుంటున్నారు. అయినప్పటికీ ఏటీఎంలు పనిచేయలేదని, ఖాతాల్లో నగదు తీయలేని పరిస్థితి ఉందని వారు వాపోతున్నారు. ఈ సమస్యపై బ్యాంకు సిబ్బందిని ప్రశ్నించగా, మరో పది రోజుల్లో ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలు అందుతాయని చెబుతున్నారు. ఇప్పటికైనా బ్యాంకు సేవలు పునరుద్ధరించాలని ఖాతాదారులు కోరుతున్నారు. లేనిపక్షంలో తాము వేరొక బ్యాంకుకు మారిపోతామని హెచ్చరిస్తున్నారు.



పడిగాపులు కాస్తున్న ఖాతాదారులు

గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు

రావికమతం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమిర గ్రామంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి అంకురార్పణ చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలు, రైతులు గ్రామ సమీపంలోని పొలాల నుంచి బాలిక తలపై వరిదుబ్బుతో ఊరేగింపుగా గ్రామంలోకి తీసుకువచ్చారు. ఆపై గౌరీపరమేశ్వరుల విగ్రహాలను రామాలయం వద్ద నెలకొల్పి పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొర్లె రవికుమార్, పాల సంఘం అధ్యక్షుడు గొర్లె సత్యనారాయణ, బీజేపీ నాయకులు గొంతిన సత్యారావు, పెద్దలు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కోలాటం పోటీలు

చీడికాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నాగులచవితిని పురస్కరించుకుని శనివారం ఏర్పాటు చేసిన కోలాటం పోటీలు ఉత్సాహంగా జరిగాయి. సాయంత్రం సంబరాలు నిర్వహించారు. అనంతరం గ్రామానికి చెందిన కామిరెడ్డి కుటుంబీకులు ఈ పోటీలు ఏర్పాటు చేసి, భారీ స్థాయిలో బహుమతులు ప్రకటించారు. దీంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి 15 కోలాటం గ్రూపుల సభ్యులు వచ్చి పోటీల్లో పాల్గొన్నారు. పోటీలను తిలకించడానికి పరిసర గ్రామాల ప్రజలు అధికంగా తరలివచ్చారు. ఈ పోటీలు అర్ధరాత్రి వరకు నిర్వహించినట్టు పర్యవేక్షకులు కె.దేముడు, వై.అప్పారావు, పి.చిన్నం నాయుడు, జి.మునలినాయుడు తెలిపారు.